# చిన్న కథ

'రాధా! 'ఫౌంటెన్' ఎవరు పాడుచేశారు యిలా?'

'............'

'రాధా!'

'........'

'రాధా!!'

'ఆఁ !వొస్తున్నా'

భర్త తీవ్రమైన అరుపులకి కారణం తెలియక కొంచెం కళవళ పాటుతో రంగారావుగారి గదిలో ప్రవేశించింది రాధ. భార్య గదిగుమ్మంలో కాలిడగానే వొళ్ళుతెలియని వీరావేశంలో మళ్ళీ అదే వరసని అందుకున్నాడు రంగారావు. 'నీకోసం ఎన్నిసార్లని అరవాలి'

'పెరట్లో కప్పులు కడుగుతున్నానండి ........ పని తొందరలో మీపిలుపు వినబడలేదు.'

'నీకు మరీ, పరాకు ఎక్కువయింది. పిలుస్తుంటే మనిషిని కాననుకున్నావా! (గుక్క తిప్పకండా) ఈకలం ఎవరు పాడుచేశారు యిలా!'

'ఏమోనండీ.... నాకేం తెలియదు ...... ఉదయం మాత్రం పిల్లలు ఈ గదిలో ఆడుకుంటూవుండగా చూచాను'

'ఉదయం పిల్లలు ఎక్కడ ఆడుకున్నది నిన్నడ గటం లేదు...... ఈ కలంఎవరు పాడుచేశారని నిన్నడ గటం!'

'పిల్లలు ఏమైనా తీశారేమో కనుక్కున్నారా?'

పైవాక్యం వెలువడిందే తడవుగా రంగారావు గదంతా 'సుశీ' 'సుశీ' అన్న కేకలతో నిండిపోయింది, సుశీ మరుక్షణమే నాన్నగారి కోపానికి కారణంతెలియక బేల మొహంతో గదిలోప్రవేశించింది.

'నాగదిలో అల్లరి చెయ్యొద్దని మీకు ఎన్నిసార్లు చెప్పాను'

నాన్నగారి ప్రశ్నకి సుశీ కళ్ళల్లో అమాంతంగా నీళ్ళు తిరిగాయి జవాబు చెప్పటానికి నోటమాట పెకల్లేదు...... ఎండిపోయిన చిరుపెదిమెల్ని నాలికచివరతో తడువుతూ, నిశ్చేష్టురాలై, జవాబుగా కళ్ళునులుపుకోవటం మొదలెట్టింది సుశీ.

'ఈకలం నువ్వు తీసావా?'

లేదన్నట్లు తలూపింది.

'తమ్ముడేమైనా తీశాడా?'

జవాబులేదు.

'జవాబుచెప్పవే?'

సుశి ఈమారుకూడా జవాబుచెప్పలేకపోయింది.

సుశి మౌనానికి రంగారావు ఉగ్రుడైపోయినాడు కళ్ళెర్రజేసి, వొళ్ళుతెలియకండా ఆ అమ్మాయిని సమీపించి ఆ గదిలో ఒకమూలకివున్న చేతిబెత్తాన్ని అందుకొని బాదటం మొదలెట్టాడు. సుశి కిక్కురుమనకుండా, పొంగిపొర్లుతూ వొస్తూన్న దుఃఖాన్ని దిగమ్రింగి 'కలం నేను తీయలేదే...... నాన్నా కలం నేను తీయలేదే' అన్న అమాయకపు అరుపులతో ఆ అత్యాచారాన్ని సహించింది.

'తమ్ముడేడి?'

రెండునిమిషాలతరువాత అడుగులో అడుగువేసుకుంటూ, ముకుళించిన మొహంతో మూడేళ్ళకూన మురళి నగ్నంగా గదిలోకి వచ్చాడు.

'ఈకలం నీవుతీశావా!'

అవునన్నట్టు తలూపాడు.

పసిపిల్లలకి అబద్ధాలాడటం తెలియదు. వాళ్ళకి అజీర్ణ వస్తువులకి మల్లే అసత్యంకూడా వొంటబట్టదు.

రంగారావు తన అసాంతం కోపం యింతకుముందే సుశిపైన తీర్చుకున్నాడు. పడకకుర్చీలో పడుకున్నవాడల్లా లేవటానికి బద్ధకించి ఆ కలాన్నేపుచ్చుకొని కూర్చున్నపాటున విసరి కొట్టాడు, మురళి మొహంమీద.

మురళికి సుశికిమల్లే దుఃఖాన్ని దిగమ్రింగటం తెలియక బోరుమని ఏడుస్తూ గదిలోంచి వెళ్ళిపోయినాడు.

రంగారావు ప్రథమకళత్రం ఈ లోకాన్ని విడిచి షుమారు మూడు సంవత్సరాలయింది. కమలను రంగారావు ఆమె బ్రతికిఉండగా అమితంగా ప్రేమించాడు. యౌవనం అంకురించిన తొలిరోజుల్లో 'ఆమెతోడిదే ఈ లోకమన్నట్లు మెలగటంవల్ల రంగారావు భార్యావిధేయుడని కూడా ప్రజల్లో ప్రతీతి అయింది.

మొదట్టిభార్య ఈ లోకాన్ని విడిచిందే తడవుగా రంగారావుకు సంబంధాలు రావటం మొదలెట్టాయి. కమల ప్రేమని అంతతొందరలో మరచి వివాహానికి సిద్ధపడట మంటే అతనికి మొదట్లో మనస్కరించలేదు. పిన్నవయస్సులోవున్న రంగారావు, తనకోసం కాకపోయినా, పసిపిల్లల కోసమైనా మళ్ళీ వివాహం చేసుకోవటం శ్రేయస్కరమని బంధువులంతా సలహాయిచ్చారు. రంగారావుకు కొంతవరకు వాళ్ళసలహా న్యాయసమ్మతంగానేగోచరించింది. ఒంటరిగా పిల్లలతో కాపురం చేయటమంటే కష్టసాధ్యంగానే కనపడింది. స్త్రీలు పిల్లల్ని యెంతో జాగ్రత్తగా పెంచుకోగలరు. పిల్లల మనోవృత్తుల్ని గూర్చి స్త్రీలకి తెలిసినంతగా పురుషులకి తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నం చేయటంకూడా

నిజంగా భగీరథ ప్రయత్నంలాగుంటుంది. ఈ విషయాలన్నీ రంగారావు మనుస్సుని బాగా కలతపెట్టాయి. పిల్లల బాగో గుల్ని బట్టి వివాహంచేసుకోవటమే అతనికి అప్పట్లో విధ్యుక్తంగా కనపడింది. ఒక స్నేహితుడిద్వారా సంబంధంకోసం ప్రయత్నం చేయటం మొదలెట్టాడు. అతను తన ప్రయత్నంలో సఫలీకృతుడై చివరకి రాధను పరిణయమాడాడు.

ఆరోజు రాత్రి రంగారావుగదిలోకి పడుక్కోవటానికి వెళ్ళేసరికి పిల్లలు ఇంకా నిద్రపోకుండా పక్కలమీద కూర్చునివున్నారు. అంతరాత్రిదాక వాళ్లు పడుకోనందుకు కొంచెం విసిగి, పడుకొమ్మని పిల్లల్ని మందలించి, తన పక్కని సమీపించాడు రంగారావు. వెళ్లి పక్కమీద మేను వాల్చిందే తడవుగా అతనికి సుఖంగా నిద్రపట్టింది.

రాత్రి పన్నెండింటికి గావును రంగారావుకు మళ్ళీ మెళకువ వచ్చింది. నిద్రమాంద్యవల్ల ఎంతర్రాత్రి అయ్యిందో అతనికి తెలియలేదు. కిటికీలోంచి బయటికిచూస్తే అర్ధ చంద్రుడు వాయువేగంగా మబ్బులోంచి పరుగెత్తుతూ వున్నట్లు అతనికి కనపడింది. నెమ్మదిగా కదలి, ఎడమ ప్రక్కని మళ్ళేసరికి పిల్లలు కిక్కురుమనకుండా దూరంగా తమ ప్రక్కలమీద కూర్చుని వున్నట్లు పొడకట్టిందాతనికి. రెండునిమిషాలు ఆలోచనా రహితంగా వాళ్ళవేపు నిదానించి చూచాడు రంగారావు.

సుశి తమ్ముడిముందు కూర్చుని మురళికంటికి ఆవిరి పెడుతోవుంది. మొదట్లో మురళి కంట్లోనలుసు ఏదో పడి వుంటుందనుకున్నాడు రంగారావు. ఒక నిమిషము తదేక దీక్షగా ఆకంటివేపు నిదానించి చూసేసరికి కన్ను అమితంగా పొంగినట్లు కనపడింది.

'మురళీ! ఏమయిందమ్మా కంటికీ?'

రంగారావు ధ్వనివినపడగానే సుశి కొంచెంగా వులికి పడి ఏమీతెలియనట్లు పడుకోవటానికి ప్రయత్నించింది.కాని యింతలో రంగారావు పిల్లల్ని సమీపించి 'భయంలేదులే తల్లీ! లేచికూర్చో' అని మందలించటంతోనే సుశి కొంచెం ధైర్యం తెచ్చుకొని మళ్ళీలేచి కూర్చుంది.

నాన్నగారి లాలనకి మురళి అమాంతంగా కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకున్నాడు. రంగారావు దిగులుగా మురళిని వొళ్ళోకి తీసుకొని, ధోవతి కుచ్చెళ్ళతో కన్నీళ్ళుతుడిచాడు. మురళి దుఃఖం నాన్నగారి బుజ్జగింపులకి అంతకంతకూ మరీ ఎక్కువయింది.

'నాన్నా! ఏమయింది నీ కింటికీ?'

మురళికి తన బాధనుగూర్చి తండ్రికి చెప్పుకోవటం చాతకాలేదు. యితరులని అర్థం చేసుకోగల శక్తి మాత్రం కలిగిందికాని తనమనోగతభావాల్ని యితరులకు సుస్పష్టంగా

వ్యక్తపరిచే జ్ఞానం ఇంకా కలుగలేదు. ఆ మాటలు రాని పసి కూనకి కంటికేదోనొప్పిఅయింది అని చెప్పటంకూడా దుర్ఘట మయింది.

మురళి అవస్థ రంగారావుకి సునాయాసంగా వ్యక్త మైంది. మళ్లీ మురళిని ప్రశ్నించటంవల్ల లాభంలేదని తెలుసు కుని 'సుశీ; ఏమయిందమ్మా తమ్ముడికంటికీ?' అని ప్రక్క నున్న అమ్మాయిని రెట్టించాడు. సుశి మొదట్లో నిజం చెప్ప టానికి జంకింది కాని రంగారావు 'భయంలేదులే' అని హామీ యిచ్చేసరికి ఆ లేతహృదయానికి ఎక్కడలేని ధైర్యం కలిగింది........

'నాన్నా!........ పొద్దునే........కలంతో.........
నీవు........కొట్టావే ........'

రంగారావుకు అంతా అర్థమయింది. ప్రొద్దుటిదృశ్యం సినిమాకి మల్లే వొకమాటుకళ్ళముందు తిరిగింది. ఉదయం పిల్లలపట్ల అంత అమానుషంగా, కౄరంగా ప్రవర్తించి నందుకు లోలోపల తన్ను తానే నిందించుకున్నాడు. పిల్లలు అనాథలకు మల్లే బ్రతకటంచూచి ఆతనిహృదయం తరుక్కు పోయింది.

'కమల అవ్యాజమైనప్రేమకి యిదాఫలితం' అన్న వొక్కప్రశ్న ఆతనిహృదయాన్ని దహించటం మొదలెట్టింది.

మరుక్షణంలోనే యిద్దరిపిల్లల్ని చెరోచంకని యెత్తుకుని తనపక్కని తిన్నగా చేరుకున్నాడు రంగారావు. మళ్ళీ అదేప్రశ్న........హృదయంలో యేదో చెప్పరాని బాధ అంకురించింది. ఆబాధా నివారణకి అప్పట్లో ఏమిచేయటమో అతని కేమీతోచలేదు. యెంతఆలోచించినా ఏమీపాలు పోలేదు. చివరకి వొక్కటేవొక్కమార్గం కనపడింది. అప్పట్లో అతనికి అదే యుక్తమైన మార్గంగా తోచింది.

ఆ తను మెకానికల్‌గా పిల్లల్ని హృదయానికి గట్టిగా అదుముకున్నాడు. కొంత మనోశాంతి కలిగింది కాని, హృదయానికి పరిపూర్ణమైన సంతృప్తి కలగలా యింకా......! యింకా.... వొళ్ళుతెలియకుండా ఆ పసిపిల్లల్ని అంతకంతకూ తనహృదయములో యిముడ్చుకోవటానికి ప్రయత్నం చేశాడు........కానిసాధ్యం కాలా...... విఫలమనోరథుడై ఏదో అర్థిస్తున్నవాడికి మల్లే కమలవేపు రెండునిమిషాలవరకు ఏకాగ్రంగా చూచాడు. ఫొటోలోంచి కమల చిరునవ్వు నవ్వినట్లు కనపడిందాతనికి. ఆలోచనరహితంగా, సంతృప్త హృదయంతో వెనుదిరిగి చూచేసరికి రాధ చిరునవ్వు నవ్వుతూవున్నట్లు పొడకట్టింది. ఆ చూపులకి గొప్ప అపరాధికి మల్లే పిల్లల్ని దెగ్గరికితీసుకొని నిండుగా శాలువకప్పుకున్నాడు రంగారావు. ఎప్పుడు నిద్రపట్టిందో ఏమో అతనికే తెలియదు..........

—★—